క్లుప్తంగా

జీవాల పెంపకంలో రాణించాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీ రామసుబ్బారెడ్డి

తుగ్గలి: గొర్రెల మందలు అభివృద్ధికి మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని షెఫర్డ్ శిక్షణ కేంద్రం ఏడీ రామసుబ్బారెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జీవాల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై పెంపకందారులకు అవగాహన కల్పించారు. గొర్రెల మంద అభివృద్ధిలో పొట్టేలు కీలకమన్నారు. విత్తన పొట్టేలు మంచిదైతే గొర్రె పిల్లల సంఖ్య ఏడాది కాలంలోనే 50 నుంచి 70 వరకు పెరుగుతుందన్నారు. ప్రతి 25 నుంచి 30 గొర్రెలకు ఒక విత్తన పొట్టేలు ఉండేలా చూసుకోవాలన్నారు. జీవాలకు ఎప్పటికప్పుడు టీకాలు అందించడం, గొర్రె ఈనిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, కనీసం రెండు నెలల పాటు పిల్లల చెంతనే గొర్రె ఉండేలా చూసుకోవాలన్నారు. పశు వైద్య శాఖ డీడీ వెంకటరమణ ప్రభుత్వం అమలు చేస్తున్న పశు బీమాపై అవగాహన కల్పించారు. ఏడీ రవిప్రకాష్, ఆర్బీలు జానకి, ప్రశాంతి, పశు వైద్యాధికారులు ప్రణీత, బాలకృష్ణ పాల్గొన్నారు.

హార్మోనియం కళాకారుడి మృతి



నారాయణ (ఫైల్)

మద్దికెర: మద్దికెరకు చెందిన ప్రముఖ హార్మోనిస్ట్ యాటాగారి నారాయణ (83) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎస్వీ ప్రసాద్ ప్రజాకళానికేతన్ తరఫున సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకులు ఆయన అంత్యక్రియలకు రూ.5 వేలు సాయం అందజేశారు. నారాయణ ఎంతోమందికి హార్మోనియంలో శిక్షణ ఇచ్చారని గుర్తుచేసుకున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

వెల్దుర్తి: మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు కూలీల వేతనాలు, మెటీరియల్ వర్క్ కలుపుకుని రూ.16.75 కోట్లతో జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ గురువారం ప్రారంభమైంది. సోషల్ ఆడిట్ ప్రతినిధులు డీఆర్పీల ఆధ్వర్యంలో బోయనపల్లె, నార్లాపురం, ఎల్ నగరం, అల్లుగుండులో గ్రామ సభల ద్వారా ఆయా పంచాయతీల పరిధిలో రూ.1.25 కోట్లతో జరిగిన పనులపై విచారణ సాగింది. పలుచోట్ల కూలీల సంతకాల్లో తేడాలు, హాజరులో అనుమానతలు గుర్తించినట్లు డీఆర్పీలు తెలిపారు. నార్లాపురం గ్రామ సభకు ఇండిపెండెంట్ అబ్జర్వర్‌గా గోవర్ధనగిరి వెటర్నరీ డాక్టర్ స్వాతి వ్యవహరించగా, సర్పంచ్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్‌కు సీటు రిజర్వ్

ఎమ్మిగనూరుటౌన్: సినీ హీరో ప్రభాస్ నటించిన ఆదిపురుష్ సినిమా శుక్రవారం రిలీజ్ కానుండటంతో అభిమాన సంఘ నాయకులు స్థానిక శివ సినిమా కాంప్లెక్స్‌లో ఆంజనేయస్వామికి ఒక రోజు ముందే సీటు రిజర్వ్ చేయించారు. ఆ సీటులో హనుమంతుడి చిత్రం ముద్రించిన కాషాయ వస్త్రాన్ని ఉంచారు. అలాగే అభిమాన సంఘ నాయకులు ఆదిపురుష్ సినిమా ఫ్లెక్సీతో 32 ఎడ్ల బండ్లపై నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది.

నైపుణ్యం వెలికితీయాలి

ఆలూరు: విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర-2 హైస్కూల్లో గురువారం ఎంఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఈ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండల కన్వీనర్ వీరేష్ పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని జూటూరు గ్రామంలో గురువారం పొలం విషయంలో రాజశేఖర్‌రెడ్డి, అతని బంధువులు అదే గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డిపై కర్రతో దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు. గత కొన్నేళ్ల నుంచి రాజశేఖర్ రెడ్డి సాగుచేసుకుంటున్న పొలంలోకి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రవేశించడంతో ఆగ్రహించి కర్రతో దాడి చేయగా రక్తగాయాలయ్యాయి. బాధితుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌రెడ్డి అతని తరఫు బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి, గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి గ్రామాల్లో గురువారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు దాడులు చేసి 18 ప్యాకెట్ల అనుమతిలేని పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 10.30 గంటలకు విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. హెచ్.కైరవాడిలో ఓ వ్యక్తి నుంచి 14 ప్యాకెట్లు, కందనాతిలో మరో వ్యక్తి నుంచి 4 ప్యాకెట్ల అనుమతి లేని పత్తి విత్తనాలు, ఒక విత్తన శుద్ధి యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రెండు ఘటనల్లో ఆరుగురు అనుమానితులను విచారిస్తున్నామన్నారు.

రెన్యూవల్ చేసుకోవాలి

గోనెగండ్ల: పంట రుణాలను రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎంఎస్ సూర్యప్రకాష్ సూచించారు. గురువారం సాయంత్రం అలువాల గ్రామంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రైతులు, మహిళలకు జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎం మాట్లాడుతూ బ్యాంకు సేవలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా గురించి వివరించారు. ఎఫ్ఐసీ మేనేజర్ సురేంద్ర, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రథాలు.. పేదల సంజీవనులు

- వైద్య సేవలకు ఊపిరి పోసిన ప్రభుత్వం
- విశేష సేవలందిస్తున్న 108, 104, 102 వాహనాలు
- ప్రజల ప్రాణాల రక్షణలో కీలకపాత్ర



క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ఆలూరు మండలం కరిడిగుడ్డం గ్రామానికి చెందిన సుజాత అనే మహిళకు తెల్లవారుజామున 3 గంటలకు పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 వాహనానికి కాల్ చేశారు. 108 అంబులెన్స్‌లో గర్భిణిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రంగస్వామి అత్యవసర వైద్యం అందించడంతో ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈమెకు ఇది రెండవ కాన్పు. అనంతరం తల్లి, శిశువును ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

కర్ణాటక రాష్ట్రం విజయపుర (హోస్పేట) జిల్లా కేంద్రానికి చెందిన బసవరాజ్, కొట్రేష్ ఆదోనికి బైక్‌పై వెళ్తున్నారు. తెల్లవారుజామున ఆలూరు సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో ఇద్దరి కాళ్లకు, తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళ్లిన వారు గమనించి 108 ఫోన్ చేసి సమాచారం అందించి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. తీవ్ర రక్తస్రావం అవుతున్న వారికి అదే వాహనంలో 40 నిమిషాల వ్యవధిలోనే ఆస్పత్రికి చేర్పడంతో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు.

ఆలూరు రూరల్: ఆపద వస్తే చాలు.. కుయ్.. కుయ్ అంటూ వేగంగా దూసుకొచ్చి ప్రజల ప్రాణాలను రక్షించడంలో కీలకపాత్ర పోషిస్తోంది 108 అంబులెన్స్. ఇక పల్లెల్లోని ప్రజల వద్దకే వైద్య సేవలు అందించే 104 సంచార వైద్య వాహనం. పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి బిడ్డను ప్రసవించిన తర్వాత తల్లీబిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చే వాహనం 102. ఇవన్నీ ఆరోగ్య రథాలుగా పేదల సంజీవనిలా ప్రజలకు విశేష సేవలందిస్తున్నాయి.

టీడీపీ హయాంలో నిర్వీర్యం

దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ ప్రవేశపెట్టిన 108 వాహన సేవలను గత టీడీపీ పాలనలో నిర్వీర్యం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించే పరిస్థితి లేక ప్రాణాలపై ఆశలు వదిలేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత మరో రెండు అడుగులు ముందుకు వేసి అత్యవసర సేవలను మరింతగ సమర్థవంతంగా అందించేలా చర్యలు చేపట్టారు.

108 అంబులెన్స్ సేవలు ఇలా..

- ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ఇంటికి వెళ్లి బాధితులను హాస్పిటల్‌కు తరలిస్తారు.
- పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల నుంచి అత్యవసర పరిస్థితుల్లో రోగులను జిల్లా సర్వజన వైద్యశాలలకు తరలించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.
- రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందిస్తూ వెంటిలేటర్ సహాయంతో వేగంగా హాస్పిటల్‌కు చేర్పుతాయి.
- నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బంది, ఆక్సిజన్ వెంటిలేటర్, ఇతర ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయి.



104 వాహనం ద్వారా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వెళ్తున్న బాలింత

104 వాహన సేవలు ఇలా..

- మండలంలోని ప్రతి పీహెచ్‌సీ కేంద్రాల పరిధిలో ఒక 104 వాహనాన్ని ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.
- గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించేందుకు వైద్యులు 104 వాహనంలో రోజుకో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందిస్తారు.
- మండల, నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే పేద ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారు.
- గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తారు.
- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి మరీ వైద్యం పరీక్షలు చేసి మందులు ఇవ్వడం విశేషం.

102 ద్వారా క్షేమంగా ఇంటికి తల్లీబిడ్డ

- ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అనంతరం మూడు రోజుల తర్వాత 102 వాహనంలో క్షేమంగా ఇంటి చేరుస్తారు.
- వాహనంలో ఏసీ సౌకర్యంతో పాటు అహ్లాదకరంగా ప్రయాణించడానికి టేప్‌రికార్డుల సదుపాయం కల్పించారు.
- తల్లీబిడ్డతో పాటు వారి సంరక్షకులు ప్రయాణించేందుకు విశాలైన సీటింగ్ సదుపాయం ఉంది.
- జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల వద్ద 102 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. డివిజన్ కేంద్రాల్లో ప్రధాన సీహెచ్‌సీలు, మండల ప్రైమరీ హెల్త్ సెంటర్లలో వాహనాలు అందుబాటులో ఉంచారు.

జిల్లాలో గత నాలుగేళ్లలో ఆరోగ్య రథాలు అందించిన సేవల వివరాలు

108 వాహనాల సంఖ్య:	27
104 వాహనాల సంఖ్య:	40
102 వాహనాల సంఖ్య:	45

2020 జూలై నుంచి 2023 మే వరకు 108 సేవలు పొందిన వారు: 2,81,259 మంది

2020 జూలై-2023 మే నెల వరకు 104 ద్వారా వైద్యం అందుకున్నవారు: 38,75,698 మంది

గతేఏడాది ఏప్రిల్ 2022 నుంచి మే 2023 వరకు 102 సేవలు పొందిన వారు: 26,353 మంది

ఆస్పత్రికి వెళ్లే ప్రయాస తీరింది



మా వీధికి వారానికోసారి 104 వాహనం వస్తుంది. నాకు బీపీ, షుగర్ ఉండడంతో ఇక్కడే డాక్టర్ పరీక్ష చేసి మందులు ఇస్తున్నారు. గతంలో ఆస్పత్రికి వెళ్లి చీటీ రాపించుకోని డాక్టర్‌కు చూపించుకునే వాళ్లం. ఏదైనా ఆరోగ్య ఇబ్బంది వస్తే ఆర్ఎంపీ డాక్టర్ దగ్గరకు పోయి డబ్బులు ఇచ్చి సూది మందులు తీసుకునే వాళ్లం. ఇప్పుడు ఆ బాధలు లేవు. మా ఇంటి వద్దకే వైద్య సేవలు తెచ్చిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. –మల్లయ్య, వృద్ధుడు, ఆలూరు

108 పునర్జన్మనిచ్చింది



నేను ఏడాది క్రితం ఆదోని నుంచి గ్రామానికి స్కూటర్‌పై వస్తుండగా ఆదోని శివారులో ఎదురుగా వచ్చిన మరో స్కూటర్ బలంగా ఢీకొట్టింది. నా తల, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. కుడి కాలు, చెయ్యి విరిగింది. 108 వాహనంలో నాకు ప్రథమ చికిత్స చేసి ఆదోని ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డాను. 108 పునర్జన్మనిచ్చింది. – రాజశేఖర్, గోనేహాల్ గ్రామం

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పత్తికొండలో.. నియోజకవర్గంలోని 5మండలాలకు చెందిన 17 మందికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.24.21 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం వర్తించని వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ, పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడకుండా వారి ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కోతిరాళ్ల సర్పంచ్ అంజినయ్య, నాయకులు మల్లికార్జున, వెంకటరాముడు, జొన్నగిరి రఘు పాల్గొన్నారు.

దిశయాప్‌తో మహిళలకు రక్షణ



యువతుల సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న డీఎస్పీ సీతారామయ్య, టౌన్ సీఐ

ఎమ్మిగనూరురూరల్: దిశ యాప్‌కు ఫిర్యాదు వచ్చిన పది నిమిషాల్లో ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని రక్షణ కల్పిస్తారని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కాలేజీ విద్యార్థినులు, మహిళలు, యువత సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. పెద్దపార్కు వద్ద డీఎస్పీ సీతారామయ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. యాప్ ఉపయోగాలు, వినియోగించే విధానాన్ని వివరించారు. ఆపద సమయంలో యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్ బటర్ ట్యాప్ చేస్తే చాలని వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. టౌన్ సీఐ మదుసుధన్‌రావు, ఎస్ఐ మస్తాన్‌వలి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో మహిళల సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఎస్పీ సీతారామయ్య పర్యవేక్షించి దిశ యాప్ ఉపయోగాలను వివరించారు.

చిప్పగిరి: మండల కేంద్రంతో పాటూ గ్రామాల్లో మహిళలకు దిశ యాప్‌పై పోలీసు సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థినులు, యువతుల సెల్‌ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. ఎస్ఐ మల్లికార్జున, ఏఎస్ఐ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వెల్దుర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేస్తూ ఇటీవలి బదిలీలలో గడివేముల ఎంపీడీఓగా వెళ్లిన శ్రీనివాసరావ్ మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా తిరిగి వెల్దుర్తి ఎంపీడీఓగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న శివమల్లేశ్వరప్ప తాను వచ్చిన స్థలం గడివేములకు వెళ్లారు.

వెల్దుర్తి: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఏఎం ప్రసాద్ రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గూడూరు మండలంలో నియోజకవర్గ ఎన్నికల డీటీగా పనిచేసిన ఆయన సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ ప్రవీణ్ గూడూరు నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

తుగ్గలి: మండల తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా రాముడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పత్తికొండలో పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఆణిముత్యాలకు ప్రోత్సాహం



పదో తరగతి టాపర్లకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



ఇంటర్మీడియెట్ టాపర్లకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



ఆలూరు నియోజకవర్గంలోని టాపర్లకు బహుమతులు అందజేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఎమ్మిగనూరుటౌన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించి మిగతా వారిలో స్ఫూర్తి నింపేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంఎస్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం.. నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఎంఈఓ ఆంజినేయులు, హెచ్ఎం కృష్ణమూర్తి, నాయకులు బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, నజీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాల'కు ఎంపికైన విద్యార్థులు

నియోజకవర్గంలో ఇంటర్మీడియెట్‌లో బనవాసి ఏపీఆర్‌జేసీకి చెందిన బోయ సుష్మ (ఎంపీసీ - 984 మార్కులు), భార్గవి (బైపీసీ- 966), అనిత (ఎంఈసీ -944), ఎమ్మిగనూరు బాలికల కళాశాలకు చెందిన ముంతాజ్‌బేగం (హెచ్ఈసీ-923), పదో తరగతిలో బాలికల హైస్కూల్‌కు చెందిన నీలిఉషోదయ, బనవాసి ఏపీఆర్ఈఎస్ నుంచి హరిజన వాసంతి ఇద్దరు 581 మార్కులు, అక్షయ, అంజలి 577, మాధవి, కడివెళ్ల మోడల్ స్కూల్‌కు చెందిన ఉదయ్ కిరణ్ 573 మార్కులు సాధించారు. వీరికి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు పురస్కారాలతో పాటు మొమెంటో, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎంఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో 'జగనన్న ఆణిముత్యాలు'కు ఎంపికైన విద్యార్థులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుమ్మనూరు నారాయణస్వామి నగదు ప్రోత్సాహకాలతో సత్కరించారు. పదో తరగతిలో ముగ్గురు, ఇంటర్మీడియెట్‌లో నలుగురు బహుమతులు అందుకున్నారు. జెడ్పీటీసీ ఏరూరుశేఖర్, ఎంఈఓలు ఈరన్న, చక్రధర్‌రాజు ప్రిన్సిపాళ్లు శివశంకర్‌ప్రసాదు, వీరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ప్రభుత్వం



మా అబ్బాయి హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీలో 944 మార్కులు సాధించాడు. ప్రభుత్వం పేద విద్యార్థులను ప్రోత్సహించి ప్రత్యేకంగా రూ.15 వేలు నగదు, ప్రశంసాపత్రం అందజేయడం చాలా సంతోషాన్నిచ్చింది. పిల్లల చదువుకు ఈ నగదు ఎంతగానో ఉపయోగపడడంతో పాటు ఉన్నతాధికారుల నుంచి సత్కారం పొందడం మరింత ఉన్నత చదువులు చదివించేలా స్ఫూర్తినిచ్చింది.

– సిద్ధప్ప, విద్యార్థి తండ్రి, హొళగుంద

ప్రతిభకు ప్రోత్సాహం



విద్యా వ్యవస్థలో సంస్కరణలతో విద్యార్థులు, తల్లిదండ్రుల మదిలో సీఎం జగనన్న చోటు సంపాదించుకున్నారు. నేను ఆలూరు మోడల్ కళాశాలలో ఎంఈసీ గ్రూపులో 944 మార్కులు సాధించాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పాటు జగనన్న కల్పించిన సౌకర్యాలతోనే ఇది సాధ్యమైంది. నాలాంటి దివ్యాంగుడి ప్రతిభను గుర్తించి సన్మానించడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

– వట్టి విజయ్‌కుమార్, మనేకుర్తి గ్రామ విద్యార్థి

విత్తన కొరత లేదు

మద్దికెర: ఆర్బీకేల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నమోదు చేసుకున్న ప్రతి రైతుకు అందజేస్తామని ఏఓ రవి గురువారం తెలిపారు. మండలానికి 1050 క్వింటాళ్లు మంజూరయ్యాయని ఇప్పటివరకు 800 మంది రైతులకు 733 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

'ఉపాధి' బిల్లులు విడుదల

తుగ్గలి: ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన 290 పనులకు సంబంధించి రూ.2.50 కోట్లు విడుదలైనట్లు ఏపీఓ రామకృష్ణ గురువారం తెలిపారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు, సీసీ రోడ్లు, పండ్ల తోటల పెంపకం తదితర పనులకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్టర్లు, రైతుల ఖతాల్లో రూ.2 కోట్ల దాకా బిల్లులు జమయ్యాయన్నారు. మరో రూ.50 లక్షలకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. త్వరలో ఆ సొమ్ము కూడా ఖాతాల్లో జమవుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర: స్థానిక బీసీ వసతి గృహంలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వేల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. స్థానిక వసతి గృహంలో దరఖాస్తులు లభిస్తాయన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు. ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి అధ్యక్షతన తమ కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి ప్రారంభమయ్యే సమావేశానికి అన్ని శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కూలీలందరికీ ఉపాధి పనులు

గోనెగండ్ల: జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ మహమ్మద్ బాష పేర్కొన్నారు. గురువారం బి.అగ్రహారం గ్రామంలో ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. ఆయన కూలీలతో మాట్లాడుతూ.. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.270 కూలీ పడుతుందన్నారు. ఉదయం 6 గంటలకు వచ్చి 12 గంటలకల్లా ఇంటికి వెళ్లేలా పనులు చేసుకోవాలన్నారు.పని ప్రదేశంలో ఏదైనాన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గడప గడపలో ఆనందం



ఎమ్మిగనూరు 32వ వార్డులో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుండటంతో ప్ర గడపలో ఆనందం వెల్లివిరుస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం పట్టణంలోని 32వ వార్డులో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులు తదితరులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు నిర్మించాలని కొందరు ఆయన దృష్టికి తీసుకురాగా సత్వర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మున్సిపల్ డీఈ నీరజ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మహిళకు తీవ్రగాయాలు

ఆలూరు రూరల్: స్కూటర్ నుంచి కింద పడి మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని హులేబీడు గ్రామానికి చెందిన పద్మావతి గురువారం ఉదయం కుమారుడు ఉపేంద్రతో కలిసి పెద్ద హోతూరు గ్రామానికి వెళ్తుండగా స్కూటర్ చక్రంలో చీర ఇరుక్కోవడంతో అదుపుతప్పి కింద పడింది. ప్రమాదంలో పద్మావతి ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

హాలహర్వి: నకిలీ విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఏఓ శివశంకర్ హెచ్చరించారు. ఆయన గురువారం చింతకుంటలోని కిసాన్‌మాల్ విత్తన దుకాణంలో రికార్డులను తనిఖీ చేశారు. బీటీ కాటన్ విత్తనాలకు సంబంధించి రికార్డులు, స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్, ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్, లైసెన్స్ పరిశీలించారు. రెండు సీడ్ శ్యాంపిల్స్, బీటీ పత్తి విత్తన శ్యాంపిల్ సేకరించారు. కృషి డాన్ కంపెనీకి సంబంధించిన త్రిశూల్, కావేరీ కంపెనీకి చెందిన జాదు విత్తన శ్యాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

అవసరమైన రైతులందరికీ విత్తనాలు

కృష్ణగిరి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులందరికీ సబ్సిడీ విత్తనాలను అందిస్తామని ఏఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని పోతుగల్లు, ఎరుకలచెర్వు ఆర్బీకేలను ఆయన గురువారం తనిఖీ చేశారు. వేరుశనగ విత్తనాలు అవసరమైన రైతులు గ్రామాల్లోని ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నీటి ఎద్దడి తీర్చండి

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గురువారం జెడ్పీటీసీ లింగప్ప జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నాలుగు చేతిబోర్లు ఉన్నా పనిచేయడం లేదన్నారు. బోర్లను బాగుచేసి మోటార్లను అమర్చి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అలాగే ట్యాంకులకు మరమ్మతులు చేయాలని, మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు.

సారా తయారీదారుల అరెస్ట్

వెల్దుర్తి: కల్లూరు మండలం ఎర్రకత్వ తండాకు చెందిన ఇద్దరు సారా తయారీదారులను గురువారం అరెస్ట్ చేసినట్లు కోడుమూరు ఎస్ఐ శ్యాంప్రసాద్ తెలిపారు. తాము వెల్దుర్తి పోలీసు సిబ్బందితో కలిసి జరిపిన దాడుల్లో.. సోమలాల్ నాయక్, కృష్ణ నాయక్ తయారు చేసిన సారాను అమ్ముకునేందుకు రామళ్లకోటకు రాగా పట్టుకున్నామన్నారు. వారినుంచి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, బైక్ సీజ్‌చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

హాలహర్వి: మండల పరిధిలోని క్షేత్రగుడి చెక్‌పోస్టును గురువారం ఏఓ శివశంకర్ తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి నకిలీ సీడ్స్ వస్తున్నాయా, ఆంధ్రా నుంచి విత్తనాలు తరలివెళ్తున్నాయా అని ఆరా తీశారు. కర్ణాటక నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువుల సరఫరాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రసీదులు తీసకొని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పాల వ్యాన్ బోల్తా

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని జీఎంఆర్ కాలేజీ వద్ద గురువారం సాయంత్రం ఎమ్మిగనూరు వైపు పాల ప్యాకెట్లతో వస్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ క్షేమంగా బయటపడ్డారు. ఘటన స్థలంలో పాల ప్యాకెట్లు చెల్లాచెదురుగా పడిపోవడంతో అక్కడున్నవారు అన్నింటిని ఒక చోటకు చేర్చారు.

విజయవంతం చేయండి

తుగ్గలి: జూలై 7న విజయవాడలో నిర్వహించే మాదిగ జన జాగృతి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్లు వెంకటేశ్వర్లు, పులికొండ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం తుగ్గలిలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

కుటుంబ సభ్యుల చెంతకు యువతి

ఆస్పరి: మతి స్థిమితం లేని 23 ఏళ్ల యువతిని ఎస్ఐ వరప్రసాద్ గురువారం కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఆలూరు వైపు నుంచి వచ్చిన యువతి బుధవారం ఆస్పరి బీసీ కాలనీలోని కొల్లాపురం అవ్వ ఆలయం వద్దకు చేరుకుంది. స్థానికులు ఆమెను ఎక్కడి నుంచి వచ్చావని అడగ్గా సరైన సమాధానం చెప్పలేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వరప్రసాద్ అక్కడికి చేరుకుని యువతిని ప్రశ్నించగా తన పేరు మహేశ్వరి అని మాత్రమే చెప్పింది. ఎస్ఐ అనుమతితో కాలనీవాసులు బుధవారం రాత్రి యువతిని తమ వద్దే ఉంచుకుని గురువారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్ఐ వరప్రసాద్ నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించి విచారించగా ఆ యువతిది హొళగుంద మండలం సమ్మతగేరి గ్రామమని తెలిసింది. విషయం తెలుసుకున్న మహేశ్వరి అన్న మారెన్న ఆస్పరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చెల్లిని తీసుకెళ్లాడు.

నీట మునిగి వ్యక్తి మృతి

నందవరం: రాయచోటి గ్రామ సమీపంలో ఈతకు వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి చెందాడు. నందవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన మల్లెపోగు నరేంద్ర అలియాస్ నరేష్ (35) రాయచోటి గ్రామానికి తన అన్న కుమారుడి పెళ్లికి వచ్చాడు. బుధవారం పెళ్లి ముగిశాక పక్కనే ఉన్న తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి నీటమునిగి మృతి చెందాడు. అక్కడున్న వారు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లి తిప్పమ్మ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ శాఖ సేవలపై సంతృప్తి

వెల్దుర్తి: వ్యవసాయానికి పగటిపూటే 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని గోవర్ధనగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం ఏఈఈ రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డోన్ విద్యుత్ డీఈఈ కేవీ రమణారావు మాట్లాడుతూ వ్యవసాయ కనెక్షన్లపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ, వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, విద్యుత్ పొదుపు ఆవశ్యకతను వివరించారు. విద్యుత్ సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సుంకన్న, ఏఓ అక్బర్‌బాష పాల్గొన్నారు.